

ప్రపంచ తెలుగు మహాసభలకు వెంకట రమణకు ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగే 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు రాజంపేటకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లె వెంకటరమణకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మహాసభల గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచందు నుండి తనకు ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. దేశ కాలమాన పరిస్థితులు మారుతున్న ప్రస్తుత తరుణంలో రచయితల పాత్ర అనే అంశమే లక్ష్యంగా జరుగుతున్న ఈ మహాసభలకు హాజరవడం సంతోషంగా ఉందని తెలిపారు.



వెంకట రమణ



రైతులతో మాట్లాడుతున్న సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ

ఎవరికి కోసం హైడ్రో పవర్ ప్రాజెక్టులు


సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ

ప్రజాశక్తి - వీరబల్లి

హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఎవరికి అమ్ముకోవాలని ఏర్పాటు చేస్తున్నారని విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి గోపాలగౌడ అన్నారు. మండలంలోని వంగిమల్లలో ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయబోతుందని పుకార్లు రావడంతో ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో తాము సర్వం కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకున్న అరకొర భూమిని ప్రభుత్వం లాక్కుంటే, తమ జీవనం ఎలా కొనసాగించాలని వాపోయారు. డికెటి భూమి ఎన్నో ఏళ్లగా తాము సాగు చేసుకుంటూ తోటలు కూడా వేసుకుంటున్నామని చెప్పారు. వాటన్నింటినీ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వమే తీసుకుంటున్నారని తెలుపుతున్నారని రైతులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ రైతుల ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతలని, వారు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ భూమి వారి హక్కు దారులన్నారు. ప్రభుత్వ భూమి అయినా ఇతర భూమయినా వారికి సర్వహక్కులు ఉంటాయన్నారు. వారు హక్కులను కాలరాసే హక్కు ఏ ప్రభుత్వాలకు ఎక్కడుందని ప్రశ్నించారు. హైడ్రో ప్రాజెక్టు నిర్మాణంతో ప్రజలకు రైతులకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఎటువంటి పారితోషకం ఇవ్వకుండా ప్రభుత్వం భూములను ఆక్రమించుకుంటే రైతుల పక్షాన ఉండి న్యాయపోరాటం చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లిన కోర్టు ద్వారా వారికి ఆర్థిక సహాయం అందేలా తాము న్యాయ సలహాలు సూచనలు ఇచ్చి రైతుల పక్షపాతిగా నిలుస్తానన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే న్యాయపోరాటం : జగన్‌మోహన్‌రాజు

ప్రాజెక్టు పేరిట రైతులకు అన్యాయం చేస్తే న్యాయపోరాటం చేసి న్యాయం జరిగేలా చూస్తామని టిడిపి జిల్లా నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. వంగిమళ్ల గ్రామాల రైతులకు ప్రాజెక్టు నిర్మాణం పట్ల చాలా అపోహాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి ఇప్పటికీ క్లారిటీ లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 1200 కోట్లు కేటాయిచారని, ప్రస్తుతం రూ.3 వేల కోట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. చాలామంది రైతులు తమ భూములు కోల్పోయే అవ కాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జై కిసాన్ అఖిలపక్ష రైతు సంఘం కార్య కర్త మదన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముందుగా ప్రాజెక్టు నిర్మాణం ఎలా ఉంటుందో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా వారికి ఎలాంటి భూములు ఉన్నా తగు పారితోషకం ఇచ్చి వారికి అనుగుణంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌విబిసి ఛానల్ డైరెక్టర్ వసంత కీర్తినారెడ్డి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి రాజా, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సురేంద్ర, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సాధన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

'సాధన' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రఖ్యాత రచయిత్రి, రిటైర్డ్ రీడర్ డాక్టర్ లక్ష్మీ రాఘవ 9వ గ్రంథం(ఏడవ కథా సంపుటి) గ్రంధావిష్కరణ ఆదివారం మదనపల్లె జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు తమ ప్రారంభ ఉపన్యాసంలో లక్ష్మీ రాఘవ చేయి తిరిగిన రచయితని, సమాజ హితకరమైన రచనలు చేస్తున్నారని కొనియాడారు. గ్రంధావిష్కరణ గావించిన రిటైర్డ్ టెలికాం డిజిఎం మనేరి రామచంద్రయ్య ఈ గ్రంథంలోని కథలలో కొన్ని సంఘటనలు తమ జీవితంలో జరిగిన సంఘటనలతో పోలి ఉన్నాయని రచయిత్రి రచనలు ప్రతి పాఠకుడికి తమ జీవితంలోని ఏదో అంశాన్ని మననానికి తెస్తాయని అన్నారు. శైలి, శిల్పం, కథా వస్తువు, క్లుప్తత, అనుభూతి ఐక్యత రసానుభూతి మొదలైన మంచి లక్షణాలన్నీ లక్ష్మీ రాఘవ 'సాధన' గ్రంథంలోని కథలలో సమపాళ్లలో చోటు చేసుకున్నాయని, మనుషులను, మనసులను చదవగలిగిన రచయిత్రి డాక్టర్ లక్ష్మీ రాఘవ అని గ్రంథ సమీక్ష గావించిన విశ్రాంత ప్రొఫెసర్ సాతవల్లి చంద్రశేఖర్ శర్మ అన్నారు.

పరిశుభ్రతతోనే సుస్థిర ఆరోగ్యం

ప్రజాశక్తి - రాయచోటి

సుస్థిర ఆరోగ్యమే లక్ష్యంగా పరిశుభ్రత వారోత్సవాలు నిర్వహించనున్నామని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున అన్నారు. ఆదివారం ప్రత్యేక పారిశుధ్య వారిత్సవాలలో భాగంగా పట్టణంలో మున్సిపాలిటీ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో క్లీన్ సిటీ క్లీన్ ఆంధ్రప్రదేశ్ అవగాహన ర్యాలీని చేపట్టారు. ర్యాలీ స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ పట్టణాలు, నగరాలు పారిశుధ్యం పై సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. పట్టణంలోని ప్రజలు కూడా తడి, పొడి, ప్రమాదకం చెత్తలను వేరు చేసి చెత్త సేకరణ కార్మికులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సుబ్బా రాయుడు, శ్రీనివాస్, నరసింహ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పర్యావరణ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలని శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం సూచించిన క్లాప్ ప్రోగ్రాంలో భాగంగా పురపాలక కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం పురపాలక కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ముందుగా పురపాలక కార్యాలయ ఆవరణలో పురపాలక పరిధిలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మెప్మా సభ్యులు,కార్మికులు పాల్గొన్నారు.



రాజంపేట : మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న పురపాలక సిబ్బంది

బయో వ్యర్థాలు.. ప్రాణాంతక వ్యాధులు

- రోడ్లపై, చెత్త వాహనాల్లో వేస్తున్న వైనం
- వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా చర్యలు శూన్యం
- చోద్యం చూస్తున్న మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మనం ఏదైనా ఆసుపత్రికి వెళితే వైద్యులు వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్ష చేయించుకుని రమ్మంటారు.. వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు అవసరాన్ని బట్టి ఇంజక్షన్ వేస్తారు.. వీటి కోసం వినియోగించిన సిరంజిలను ఎక్కడ పడితే అక్కడ వేయడం ప్రాణాంతకం. వాటిని తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన బయోమెడికల్ వ్యర్థ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ఇవ్వాలి. కొందరు వైద్యులు కక్కుర్తి పడి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వాహకులకు వ్యర్థాలు ఇవ్వడం లేదు. రోడ్లపై, చెత్త కుండీల్లో పడేస్తున్నారు. వందల సంఖ్యలో చిన్న, పెద్ద ఆసుపత్రులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. ఆసుపత్రులు, ల్యాబ్‌లు వ్యర్థాలను వీరికి ఇవ్వకుండా రోడ్లపై, చెత్త కుండీల్లో, మున్సిపల్ చెత్త వాహనాల్లో వేస్తున్నారు.

రాజంపేట పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రులు, వాటికి అనుసంధానమైన ల్యాబరేటరీలు, మెడికల్ షాపుల నుండి రోజుకు కొన్ని వేలల్లో బయోవ్యర్థాలు పోగవుతూ ఉంటాయి. అలా పోగైన బయోవ్యర్థాలను సాధారణ వ్యర్థాలను తొలగించే పురపాలక వాహనాలలో కాకుండా ఒక ప్రత్యేక వాహనం ద్వారా జనావాసాలు లేని ఒక సురక్షితమైన ప్రాంతానికి తరలించి అక్కడ కాల్చివేయాల్సి ఉంది. పట్టణంలో అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఆసుపత్రులు నుంచి విడుదలయ్యే సూదులు, సిరంజిలు, గాయాలకు కట్లు కట్టిన దూది, కట్టు గుడ్డ, బ్యాండేజ్ క్లాత్స్, బ్లడ్ బాగ్స్, సెలైన్ బాటిళ్లు, ఐవి సెట్లు, గ్లౌజులు, లాబరేటరీలు నుంచి విడుదలయ్యే రక్తం తీయుటకు వినియోగించిన సూదులు, దూది, డిస్పోజల్ టెస్ట్ ట్యూబ్‌లు, మెడికల్ షాపుల నుంచి విడుదలయ్యే ఎక్స్పైరీ డేట్ అయిపోయిన మందులు మొదలైన వాటిని ఎక్కడబడితే అక్కడ రోడ్లమీద, మురుగు కాలువలు, చెత్త డబ్బాలలోను విచ్చలవిడిగా పడవేస్తున్నారు. ఇలా పడవేయడం వలన చెత్త ఎత్తే సమయంలో వాటి బారిన పడి మున్సిపల్ కార్మికులు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. హెచ్ఐవి రోగులకు వినియోగించే సూదులు, బయోవ్యర్థాలు సైతం అందులో ఉండడం వలన పొరపాటున కార్మికులకు ఆ సూదులు గుచ్చుకుంటే వారి జీవితాలు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదు. చెత్తకుప్పల దగ్గర వాటిని పడవేయడం వలన ఆవులు, కుక్కలు, ఇతర జంతువులు వాటిని తిని గాయాలపాలై రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు. బయోవ్యర్థాల మేనేజ్మెంట్ చట్టం 1996 యాక్ట్ ప్రకారం ఈ వ్యర్థాలు ఇతర సాధారణ వ్యర్థాలతో కలవకూడదు. ప్రత్యేకమైన జాగ్రత్తలతో తరలించి వాటిని కాల్చివేయాలని చట్టం చెబుతోంది. కడప, తిరుపతి వంటి నగరాలలో బయోవ్యర్థాలను తరలించడానికి ప్రత్యేకమైన కంటైనర్లను వినియోగిస్తున్నారు. పట్టణంలో అలాంటి ప్రత్యేకమైన చర్యలు చేపట్టకపోతే ప్రజలు, పశువులతో పాటు పర్యావరణం కూడా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా బయో మెడికల్ వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేకమైన కంటైనర్లు, వాహనాలను వినియోగించాలని, ఈ వ్యర్థాలను ఆసుపత్రులు, మెడికల్ షాపులు, లేబరేటరీల వారు ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా చెత్తకుప్పల లోను, డ్రైనేజీ కాలువలలోను పడవేయకుండా మునిసిపల్ మరియు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఓ ఆసుపత్రి వద్ద విచ్చలవిడిగా పడవేసిన బయో వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం

ప్రయివేటు ఆసుపత్రులు బయోవ్యర్థాలను తరలించడానికి రుసుము చెల్లించి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కానీ వారు అలా చేయడం లేదు. ఇదే సమస్యపై గతంలో ఆసుపత్రుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడం జరిగింది. కానీ ప్రైవేటు ఆసుపత్రుల వారు షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరలా ఈ సమస్య పట్ల ప్రైవేటు ఆసుపత్రులకు గట్టిగా హెచ్చరికలు జారీ చేసి అదుపు చేయడానికి ప్రయత్నిస్తాను.



- శంకర్, శానిటరీ ఇన్స్పెక్టర్, రాజంపేట.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉపాధ్యాయ బదిలీలకు షెడ్యూల్ విడుదల చేసి మరో పక్క ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అక్రమ బదిలీలు నిర్వహిచడం అప్రజాస్వామికమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామంటూ జిఒ విడుదల చేసిన ప్రభుత్వం, కొందరు ఉపాధ్యాయుల పైరవీలకు తలొగ్గి కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ దొడ్డిదారిన అక్రమ బదిలీలు నిర్వహించడం దుర్మార్గమన్నారు. బుధవారం విజయవాడలో జరిగిన జిల్లా విద్యాశాఖాధికారుల సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖాధికారులు అక్రమ బదిలీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రహస్య సీల్డ్ కవర్లో డిఇఒలకు అందజేయడం శోచనీయమన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీల్లో కేటగిరి 1, 2లలోని కొన్ని స్థానాలను బ్లాక్ చేస్తామని ఇప్పటికే అధికారులు ప్రకటించారని, మిగిలిన ఖాళీలను సిఫార్సు బదిలీల ద్వారా భర్తీ చేస్తే మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులు మారుమూల ప్రాంతాల్లోనే ఉండి పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. జిఒలో పేర్కొన్న విధంగా బదిలీల సాఫ్ట్ వేర్‌ను అభివృద్ధి చేయకుండా ఉపాధ్యాయులను ఇబ్బందులను గురిచేయడం సరైందికాదని పేర్కొన్నారు. బదిలీలపై ఉన్న అభ్యంతరాలు, అసంబద్ధాలపై గౌరవ విద్యాశాఖ మంత్రి మరియు విద్యా శాఖ అధికారులతో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించన అంశాలపై బదిలీ ధరఖాస్తు గడువు ముగుస్తున్న స్పష్టతనివ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. బదిలీ ధరఖాస్తు గడువును మరో రెండు రోజులు పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణమే సిఫార్సు బదిలీలను రద్దు చేసి తమ పారదర్శకతను, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు శివారెడ్డి,హేమలత, జిల్లా ట్రెజరర్ అక్రం బాషా, జిల్లా కార్యదర్శులు చంద్ర శేఖర్, రమణ మూర్తి, శ్రీధర్ రెడ్డి, వెంకట సుబ్బయ్య, గోపాల్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట రమణ, కృష్ణారెడ్డి, చెంగల్ రాజు, ఆడిట్ కమిటీ కన్వీనరు సురేంద్ర రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు



బిసి వసతి గృహంలో విచారిస్తున్న తహశీల్దారు తులసమ్మ

ప్రజాశక్తి-వీరబలి

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ తులసమ్మ పేర్కొన్నారు. బిసి వసతి గృహంలో ఆదివారం ఆమె విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. వాచ్ మెన్‌గా ప్రయివేట్ వ్యక్తిని ఎందుకు నియమించుకున్నారని వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం ఎలా ఉందని మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అవన్నీ బాగున్నాయని గంగాధర్ ప్రవర్తన తీరుతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

అనధికార వాచ్‌మెన్‌ను విధుల నుంచి తొలగింపు

స్థానిక బాలుర బిసి వసతి గృహం అనధికార వాచ్‌మెన్ గంగాధర్‌ను విధుల నుంచి తొలగించారు. విద్యార్థుల పట్ల అసభ్యకరంగా మాట్లాడడం, వారి నుంచి డబ్బులు తీసుకుని మద్యం తెప్పించుకోవడం, భోజనంలో పురుగులున్నాయని చెప్పినా అలాగే తినాలని, లేకపోతే అన్నం లేకుండా చేస్తానని విద్యార్థులను బెదిరించడం వంటి చర్యలకు వాచ్‌మెన్ పాల్పడ్డారు. ఆయనపై విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆయన్ను స్టేషన్‌కు పిలిపించి మందలించి పంపారు. విషయం వసతి గృహ సంక్షేమాధికారి సుబ్బరాజు దృష్టికి తెలపడంతో అతన్ని విధులకు రావొద్దని ఆదేశించారు. బిసి వసతి గృహ సంక్షేమ అధికారి పులివెందులలో పనిచేసిన సమయంలోనూ గంగాధర్ కూడా అక్కడే పని చేసేవారు. ప్రస్తుతం వార్డెన్ బదిలీపై వీరబల్లికి వచ్చారు. ఇక్కడ రెండు నెలలు నుంచి గంగాధర్‌ను తన సొంత డబ్బులు జీతంగా ఇస్తూ విధుల్లో ఉంచారు. ప్రస్తుతం విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వారి నుంచి మద్యం తప్పించుకోవడం వంటి పనులు చేస్తుండగా విధుల నుంచి తొలగించినట్లు వార్డెన్ సుబ్బరాజు చెప్పారు.

వైసిపి అరాచకాలతో ప్రజలు విలవిల : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో జగన్‌రెడ్డి అండ్‌కోఅచారకాలతో ప్రజలు విలవిల్లాడుతున్నారుని, ప్రతిపక్షం చేస్తున్న కార్యక్రమాలపై అధికార పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారుని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాచర్లలో టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమంపై వైసీపీ చేసిన దమనకాండ మరువక ముందే చెన్నేకొత్తపల్లిలో మరో దుశ్చర్యకు వైసిపి నాయకులు ఒడిగట్టడం దుర్మార్గమన్నారు. తాడేపల్లి నుంచి మారుమూల పల్లెల వరకు పులివెందుల ఫ్యాక్షనిజం వైరస్‌లా సోకిందనడానికి ఈ దాడులే నిదర్శనం అన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా వైసిపి అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఆ కార్యక్రమాలకు టిడిపి ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత కల్పించిందన్నారు. కానీ నేడు టిడిపి చేపడుతున్న కార్యక్రమాలపై, పాల్గొంటున్న కార్యకర్తలపై వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులు, హత్యలకు దిగడం ఫ్యాక్షనిస్టుల పాలనకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. తాజాగా సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం గువ్వలగొందపల్లిలో మాజీమంత్రి పరిటాసునీత నిర్వహించిన రైతుకోసం టీడీపీ పాదయాత్రలో పాల్గొన్న ఆటోడ్రైవర్ గోపాల్‌కు చెందిన ఆటోను తగులబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిడిపి జెండా కట్టినందుకు ఆటోను తగులబెట్టి గోపాల్ కుటుంబ ఆదాయవనరును నాశనం చేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదమన్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి గోపాల్ ఆటోను తగులబెట్టిన వైసీపీ దుండగులను అరెస్టు చేసి తగు శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి హరి, అమర్నాథ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మాచర్లలో టిడిపి నేతలపై చేసిన విధ్వంస కాండ దారుణమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు తీవ్రంగా ఖండించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముందుగా నిర్ణయించిన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో కరపత్రాలు పంచుతూ రాష్ట్రంలో వైసిపి పాలన ద్వారా ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలు తెలుసుకుంటూ మున్సిపల్ కార్యాలయం ప్రాంతానికి చేరుకోవడంతో అక్కడ మున్సిపల్ చైర్మన్ కిషోర్ ఆధ్వర్యంలో వందలాది మంది పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రౌడీ మూక టిడిపి నేత బ్రహ్మారెడ్డి, టిడిపి కార్యకర్తలపై దాడి చేయడం చాలా దుర్మార్గపు చర్య అని అన్నారు. దాడికి గురైన బ్రహ్మారెడ్డిని అరెస్టు చేశారుగాని తురక కిషోర్ ను అరెస్టు చేయలేదని, కార్డన్ సెర్చ్ చేసి టిడిపి వారి వద్ద ఆయుధాలు లేవని తెలుసుకున్న తర్వాతే దాడి చేసి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. రాష్ట్ర పోలీస్ శాఖ, డిజిపి చర్యలు తీసుకోవాలని., పోలీస్ అధికారులను కూడా వెంటనే వారి బాధ్యతల నుండి తొలగించాలని., లేనిపక్షంలో రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేసి శ్రీలంకలో ప్రధానిని తరిమిన విధంగా మిమ్మల్ని కూడా తరిమికొడతారని రాజంపేట, రాష్ట్ర ప్రజానీకం ద్వారా తెలుగుదేశం పార్టీ తరఫున ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వైసిపి నేతలను హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా



ఆర్‌టిపిపిని సందర్శించిన మిట్స్ విద్యార్థుల బృందం

ఆర్‌టిపిపిని సందర్శించిన మిట్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-కురబలకోట

మిట్స్ కళాశాలు బిటెక్ మూడవ సంవత్సరం ఇఇఇ చదువుతున్న విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ జిల్లా ఎర్రగుంట్ల రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌ను ఆదివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ ఆధ్వర్యంలో సందర్శించారు. బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్లలో ఒకటని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు పేర్కొన్నారు. అక్కడి సిబ్బంది, ఆర్‌టిపిపి వివరాలను వివరించారు. విద్యార్థులు బాయిలర్, కూలింగ్ టవర్లు, టర్బైన్, జనరేటర్ గది పనితీరును చూసిన థర్మల్ పవర్ ప్లాంట్ ఆపరేషన్, నియంత్రణను నేర్చుకున్నారు. ఇఇ హరిబాబు పవర్ ప్లాంట్ ప్రక్రియను వివరించారు. విద్యార్థులను సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వారు మొత్తం థర్మల్ పవర్ పిఎల్‌సి ఆధారిత నియంత్రణను చూశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుళ్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు సెల్‌ఫోన్ సర్వీసుపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీ సత్యసాయి ఉచిత ఉపాధి శిక్షణ పథకం కింద స్థానిక చిత్తూరు బస్టాండ్, పెంచుపాడు రోడ్డు నందు గల సత్యసాయి సేవామందిరం నందు పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 35 సంవత్సరాల మధ్య గల అన్నమయ్య జిల్లా లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అందించాలన్న సత్సంకల్పంతో బ్యాంకర్ల గ్రామీణ మరియు ఔత్సాహికుల అభివ ృద్ధి సంస్థ, హైదరాబాద్ వారిచే సెల్ ఫోన్ సర్వీసింగ్ లో హార్డ్ వేర్ మరియు సాఫ్ట్ వేర్ ఐఫోన్ తో సహా అన్ని రకములైన ఫోన్లకు సంబంధించి 40 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ఎన్.వి.ఎన్.ఎల్ శివకుమార్ అన్నారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా కాలంలో శిక్షణకు అవసరమైన మెటీరియల్ తో పాటు శిక్షణ తీసుకుంటున్న వారికి ఉచితముగా మధ్యాహ్న భోజనం మరియు టీ అందింస్తామన్నారు. శిక్షణానంతరం ఇందులకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేస్తామని, ఈ సర్టిఫికెట్ల ద్వారా శిక్షణ తీసుకున్న వారు భవిష్యత్తులో ఉద్యోగాలను సైతం పొందవచ్చునన్నారు. శిక్షణ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, కులమతాలకు అతీతంగా అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

రిజర్వేషన్ల నిరాకరణ రాజ్యాంగ విరుద్ధం

- కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మతం మారారనే కారణంతో దళిత క్రైస్తవులకు, ముస్లిములకు రిజర్వేషన్లు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం అన్నమయ్య జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిరిపురి రామచంద్ర ఆదివారం డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భిన్నంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సర్వత్రా వ్యతిరేకించాలని తెలిపారు. దళిత క్రైస్తవ ముస్లిములకు రిజర్వేషన్ ఇవ్వబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన అప్పీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు మతం మారినంతమాత్రాన సామాజికంగా ఎదురవుతున్న వివక్ష పోదని అన్నారు. ఎస్సీ కోట రిజర్వేషన్ల ఉద్యోగం పొంది చర్చిలకు వెళితే క్రైస్తవులుగా గుర్తించి వారిని ఉద్యోగాల నుంచి భద్రత చేయాలన్న మద్రాస్ హైకోర్టు తీర్పు సామాజిక న్యాయానికి విగాథం కలిగిస్తుందని తెలిపారు. దళిత క్రైస్తవ ముస్లిముల ఎస్సీ రిజర్వేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ వెంకటయ్య


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

షటిల్ టోర్నీ విజేతగా నిలిచిన రాయచోటి

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువులో నిర్వహించిన షటిల్ టోర్నమెంటులో జిల్లా కేంద్రమైన రాయచోటిటీం విన్నర్స్ గా నిలిచింది. ములకలచెరువులోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సెటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ఇండోర్ స్టేడియం యజమాని మహేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. టోర్నమెంట్లో సుమారు 30 టీములు పాల్గొనగా నాలుగు టీములు మాత్రమే అర్హత సాధించాయి. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ యువత క్రీడాలు రాణించడం వల్ల మేధో శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం మొదటి బహుమతి రాయచోటికు షిల్డ్‌తో పాటు రూ.5000 నగదు, రెండో బహుమతి ములకల చెరువు జట్టుకు షిల్డ్ తో పాటు రూ.3000 నగదు, మూడో బహుమతి మదనపల్లి జట్టుకు షిల్డ్‌తో పాటు రూ.2000 నగదు, నాలుగో బహుమతి బికొత్తకోట జట్టుకు షిల్డ్ అందజేశారు. గెలుపొందిన టీం సభ్యులను స్పాన్సర్లు మహేష్, నజీర్ బేగ్ మౌలాలి, ప్రభాకర్ రెడ్డిలు అభినందించారు.


ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - పుల్లంపేట

మండలంలోని అప్పయ్యరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామక్కపల్లె లో ఆదివారం ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టిడిపి ఇంచార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదని అన్నారు. పార్టీ ఏర్పడిన అప్పటి నుంచి మన రాష్ట్రానికి ప్రజలకు పట్టిన నిరుద్యోగ సమస్య, అడ్డగోలుగా నిత్యవసర ధరలు, ఇసుక మాఫియా తాగునీటి సమస్య, కరెంటు సమస్య, దుర్భరమైన రోడ్లు, నిధులు దుర్వినియోగము, గిట్టుబాటు ధరలు రాజధాని రాజకీయాలు నిలకడ లేని పాలన తో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సుధాకర్, క్లస్టర్ ఇంచార్జ్ చంద్రశేఖర్ నాయుడు, పోలి జగదీశ్వర్ రెడ్డి, పోలూరు కృష్ణమ నాయుడు, యువత అధ్యక్షులు మారోతిమల్లి, రాష్ట్రతెలుగుయువత ఉపాధ్యక్షులు కె.కె.చౌదరి, చప్పిడిబాబు, మద్దినగిరి, వెంకటసుబ్బయ్యయాదవ్, ముద్దా గంగి రెడ్డి, కేతు రంగారెడ్డి, చుండుఈశ్వర్, భరత్ కోనంకి సుధాకర్, శంకర రాజు, పల్లపు జనార్ధన్, బిసి నాయకులు శివయ్య, శ్రీకాంత్, భీమిశెట్టి నారాయణ, వెంక టేష్, చిన్న రెడ్డయ్య ఎస్సి నాయకులు ఎర్ర తోటి సురేష్, గొందిపల్లి గంగాధర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మొటుకుపల్లిలో గడప గడపకూ..

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని మొటుకుపల్లిపంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరవుతున్నారని స్థానిక వైసిపి నాయకులు ఆదివారం పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు నాయనబావి మీదుగా గట్లపై తంగేవారిపల్లి, ఇరివారిపల్లి, ఓచెరువు, బండమీద గొల్లపల్లి, టేకులపెంట, ఎలకలపెంట, పులుసుమానిపెంట , మోటుకు పల్లి, అరిమానిపెంట, బద్దిపల్లి, చిన్నపల్లి, ముడివారిపల్లి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు వారు వెల్లడించారు. మండలంలోని అధికారులు, గ్రామ సచివా లయ సిబ్బంది, ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రేపు ద్విచక్ర వాహనాలకు వేలం

ప్రజాశక్తి -ములకలచెరువు

వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 20న స్థానిక ఎస్ఇబి కార్యాలయం ఆవరణంలో వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు సిఐ మల్లికా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 20 వాహనాలకు వేలంపాటలు నిర్వహించనునట్లు సిఐ పేర్కొన్నారు.

ఆకేపాటి సుధాకర్‌రెడ్డికి పితృవియోగం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


ఆకేపాటి వెంకటసుబ్బారెడ్డి (ఫైల్ ఫొటో)

పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్నటువంటి శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆకేపాటి సుధాకర్ రెడ్డి తండ్రి ఆకేపాటి వెంకటసుబ్బారెడ్డి (86) ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుధాకర్ రెడ్డి తండ్రి మృతి చెందాడని విషయం తెలియడంతో బంధువులు, స్నేహితులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. అంత్యక్రియలు సోమవారం ఆకేపాడులో నిర్వహించనున్నారు.

బిసి 'బి' కులధృవీకరణ మంజూరు చేయాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఉమ్మడి చిత్తూరు జిల్లాలలో నివసిస్తున్నటువంటి మొరుసుకాపురెడ్డి (వక్కలిగ) కులస్తులకి ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో 33 ప్రకారం బిసి–బి కులవీకరణ పత్రాలను మంజూరు చేయాలని మొరు సుకాపురెడ్డి సంఘం బి.కొత్తకోట మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉండే మొరుసుకాపు రెడ్లకి ఉన్నటివంటి బీసీ–బి జీవోని 2019 సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకి కూడా వర్తింపు చేస్తూ జీవో 33ని ఇచ్చారని తెలిపారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఉండే మొరుసుకాపురెడ్డి కులస్థులకి ఈ జీవో 33 ప్రకారం అక్కడ స్థానిక తహశీల్దార్ కార్యాలయాల్లో బిసి–బి కులధ్రువీకరణ పత్రాలు యాథవిధిగా మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాష్టంలోనే అత్యదికంగా మొరుసుకాపురెడ్డి (ఒక్కలిగ) కులస్థులు తంబళ్లపల్లి నియోజకవర్గంలోనే సుమారుగా ఒక లక్ష వరకు జనాభా, డెబ్భై వేల వరకు ఓట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఏదైనా ఒక జీవోని ఇస్తే ఆ జిల్లాలో ఉండే అన్ని మండలాలకి వర్తిస్తుంది,కానీ ఈ 33 జీవోని కొన్ని మండలాల్లో అనుసరిస్తూ కులధ్రువీకరణ పత్రాలు ఇస్తుంటే మరికొన్ని మండలాల్లో మొరుసుకాపురెడ్డి కులస్థులకి కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఆ జీవో 33 కాపీని అధికారులు అర్థం చేసుకొని మొరుసుకాపులకి బిసి–బి కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నదానం చాలా గొప్పదని హెల్పింగ్ న్యూస్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటరమణ, సలహాదారులు శశిధర్ అన్నారు. హెల్పింగ్ హాండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉబ్లీకి చెందిన హబీబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నాగార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి

స్థానిక డైట్ కళాశాలలో ఆదివారం చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 30 మండలాల నుంచి హాజరుకాగా ప్రభుత్వ పాఠశాల నుంచి ఏపీ మోడల్ స్కూల్ రాయచోటి విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాలల నుంచి ఎస్‌విఎస్ఎన్ హై స్కూల్ పీలేరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, శాస్త్రియ ఆలోచనలను పెంపొందించే దిశగా 35 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక నిరంతర కృషి చేస్తుందన్నారు. అనంతరంజిల్లా అధ్యక్షులు కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, ప్రశ్నించే తత్వాన్ని పెంచే దిశగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులుహరినాథ్ రెడ్డి, నారాయణరెడ్డి చేతుల మీదుగా మెమోంటోతో పాటు సర్టిఫికెట్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు అసూదుల్లా బాష, లెక్చరర్స్ రెడ్డప్పరెడ్డి, రియాజ్, నాగరాజు తోపాటు జెవివి జిల్లా, రౌఫ్‌బాష, రవీంద్రనాథ్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ప్రభుచరణ్, క్రిష్టారెడ్డి, వెంకటేశ్వర్లు,రాజయ్య,శంకరయ్య పాల్గొన్నారు.


సర్టిఫికెట్లతో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

వడ్డెరలపై కేసు నమోదు దురదృష్టకరం

ప్రజాశక్తి - రాయచోటి

శుక్రవారం గుంటూరు జిల్లా మాచర్లలో జరిగిన అల్లర్లలో ఇరువైపులా వడ్డెర్లపైనే కేసులు నమోదుకావడం దురదృష్టకరమని వడ్డెర విద్యావంతుల రాష్ట్ర కన్వీనర్ కుర్రపోతుల జీవానందం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయల సీమ జిల్లాలకే పరిమితమైన ఇలాంటి దుష్ట సంస్కృతి రాష్ట్రమంతటా పాకడం క్షమించరానిదని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో ఏ రాజకీయ నాయకుడైనా గడపదాటి బయట తిరగాలంటే నమ్మకమైన వ్యక్తిగత అంగ రక్షకులను నియమించు కోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. వడ్డెర జాతిలో శారీర దారుఢ్యం తోబాటు ధైర్యం తెగువ, నమ్మితే ప్రాణత్యాగానికైనా వెనుకాడని మిలిటెంటు స్వభావం ఉందని చెప్పారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ముద్దనూరు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎల్‌ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చి పాస్టర్ దేవసహాయం ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ సమీపంలోని మైదానంలో ఎల్ఎమ్ కాంపౌండ్ యువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నాలుగు టీంలు పాల్గొన్నాయి. ఉదయం ప్రవీణ్ లెవెన్ టీంపై ఏసుదాసు లెవెన్ టీం గెలుపొందగా.. అరుణ్ లెవెన్ శ్రీకాంత్ లెవెల్ టీం గెలుపొందాయి. మధ్యాహ్నం నిర్వహించిన ఫైనల్లో అరుణ్ టీంపై ఏసుదాసు టీం విజయం సాధించింది. విజేతలకు క్రిస్మస్ రోజున బహుమతులు అందజేయనున్నారు. అంపైర్లుగా ఏసు, అరుణ్, సురేష్, ప్రవీణ్, జానీ వ్యవహరించారు.

స్కాలర్‌షిప్‌లను వెంటనే పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎస్సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీ విద్యార్థులకు ఇచ్చే ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను, మైనార్టీ విద్యార్థులకిచ్చే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి నిర్ణయాలు ఈ ఫాసిస్టు ప్రభుత్వపు పేదల వ్యతిరేక, కార్మిక వర్గ వ్యతిరేక విధానాలకు తార్కాణమన్నారు. ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం వర్గాల ప్రజలు దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి స్కూల్స్, ఉన్నత విద్యా సంస్థల్లోనూ చేరేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన సమయంలో.. వారిని చదువు నుంచి దూరం చేసే చర్యలు తీసుకోవడం హేయనీయమన్నారు. అభివృద్ధి, సమాజం నుండ మైనారిటీలను దూరం చేసే చర్యల్లో భాగంగానే ఈ ఫాసిస్టు ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుందని డివైఎఫ్ఐ భావిస్తోందన్నారు. ఉచిత నిర్బంధ విద్యను సాకుగా చూపి కేవలం 9,10 తరగతి విద్యార్థులకు ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను పరిమితి చేయడం సరికాదన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను పునరుద్ధరించాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేస్తోం దన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, రఘు పాల్గొన్నారు.

యంత్రంతో పొలం గుల్ల.. రైతులకు భారం


వరి కోత యంత్రం వల్ల గుంతలుగా మారిన పొలం

ప్రజాశక్తి - చాపాడు

అధిక వర్షాలకు వరి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు బురదలో వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి చేయించడం వల్ల గుంతలు ఏర్పడి రైతులకు ఇబ్బందికరంగా మారాయి. వీటిని చదును చేసుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రత్యేకంగా ట్రిల్లర్, దుక్కిళ్లు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఖరీఫ్ సీజన్ వరి నూర్పిడి అనంతరం సాధారణంగా నూగు, దోస, మినుము, పెసర పంటలను రైతులు సాగు చేసేవారు. ప్రస్తుతం వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలతో సాధారణ దుక్కిళ్లతోపాటు పంటల సాగు సాధ్య పడదు. పంట పొలాలకు అధికంగా నీరు పెట్టి ట్రిల్లర్, గేజివీల్స్‌తో దుక్కులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కెసి కాలువకు నీరు వస్తుండడంతో వరి సాగుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. సాధారణ ఆరుతడి పంటలు సాగు చేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడితే ఈ గుంతలతో ఇబ్బం దికరంగా తయారైంది. పం ట పొలాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయార య్యాయి. వీటిని తొలగించుకునేందుకు రైతు లకు ఆర్థికభారం తప్పడం లేదు. రెండు, మూడు సార్లు దుక్కిళ్లు చేస్తే తప్ప వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలు తొలగించుకునే పరిస్థితి లేదు.

ఆరుతడి పంటలకు తెగుళ్లు.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన ఆరుతడి పంటలను తెగుళ్ల ఆశించాయి. కూరగాయల, దోస పంటలకు తెగుళ్లు, వైరస్ అధికంగా సోకుతుండండంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా వరి పంట నూర్పిడి అనంతరం ఆరుతడి పంటలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఎక్కువగా బీర, కాకర, చిక్కుడు, అనప, బెండ వంటి కూరగాయల సాగును, దోసను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం తీగజాతి కూరగాయల పంటలను ఆకుమచ్చ, బొబ్బడాలు, పెంకు పురుగు, పాము పొడ, గుమ్మడి తెగులు, బూజు తెగులు వంటివి ఆశిస్తున్నాయి. వీటితో రైతులు కుదేలవుతున్నారు. పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఎక్కువగా క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తున్నారు. వేసవిలో ఆరుతడి పంటల ద్వారా సంపాదించుకోవచ్చునని కూరగాయల పంటలను సాగు చేస్తే అవి తెగుళ్ల బారిన పడుతున్నాయని రైతు దిగాలు చెందుతున్నాడు. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో మైదుకూరు, దువ్వూరు మండలాల్లో కూరగాయల సాగు రైతులను చేపట్టేవారు. ప్రస్తుతం చాపాడు, ఖాజీపేట మండలాల్లో కూడా కూరగాయల సాగును రైతులు అధికంగా చేపడుతున్నారు. కూరగాయల పంటల సాగు వివిధ దశల్లో ఉన్నాయి. పురుగుమందుల కంపెనీ వారు సూచించిన పలు రకాల క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రైతులకు పలు సూచనలు అందిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.


సీతారామాపురం వద్ద దోస పంటలో మందులు పిచికారీ చేస్తున్న రైతు

కల్తీ మద్యం తయారీ శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే యథేచ్ఛగా కల్తీ మద్యం తయారీ చేసి విక్రయాలు చేయడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో కల్తీ మద్యం తయారీ చేసి, విక్రయిస్తున్న ప్రభుత్వ మద్యం షాపులను ఆదివారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లా డుతూ వైసిపి పాలనలో రాష్ట్రం మద్యాం ధ్రాప్రదేశ్‌గా మారిందన్నారు. ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ మద్యం దుకాణాలపై దాడులు చేసి కల్తీ మద్యం బాటిళ్లను, స్పిరిట్, నకిలీ లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కంచె చేను మేసినట్లు ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బందే చేతివాటం ప్రదర్శించడం సరికాదన్నారు. తాగుబోతుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి తన మేనిఫెస్టోలో చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దశల వారీగా మద్యాన్ని నిషేధిస్తామని మేని ఫెస్టోలో చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మద్యపాన నిషా పథకం అమలు చేస్తు న్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మద్యపాన నిషేధాన్ని రాష్ట్ర వ్యా ప్తంగా అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ప్రభుత్వ మద్యం షాపు వద్ద తులసిరెడ్డి

కల్తీ మద్యం అమ్మకాలు దురదృష్టకరం : టిడిపి

ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీలో ఉన్న వేంపల్లె బ్రాంది షాపుల్లో కల్తీ మద్యం అమ్మకాలు దురదృష్టకరమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజులు నుండి మద్యం షాపుల్లో పని చేస్తున్న వ్యక్తులే కల్తీ మద్యం విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. బాటిల్‌కు ఉన్న లేబుల్ మార్చి అదనపు ధరపెట్టి అమ్మకాలు చేయడం దారుణమన్నారు. కల్తీ మద్యంతో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే కల్తీ మద్యం విక్రయాలు చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టక పోవడం దారుణ మన్నారు. కల్తీ మద్యంతో అనారోగ్యం పాలవు తున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం విక్ర యాలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు గోగుల మల్లికార్జున, మహ మ్మద్ ఇదాయతుల్లా, వీరభద్ర, పోతిరెడ్డి శివ, అల్లాబక్ష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి మండలకన్వీనర్


అపూర్వ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కలకడ

30 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల కలయిక సంతోషదాయకంగా ఉందని 1986–87 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తెలియజేశారు. ఆదివారం మండలంలోని నడిమి చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1986–87 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సుమారు 64 మంది ఉండగా వారిలో 52 మంది హాజరై పండుగ వాతావ రణంలో పూర్వవిద్యార్థుల కలయిక నిర్వహించారు.గతంలో పాఠశాలలో చదివిన సమ యంలో వారు చేసిన అల్లర్లు, చిలిపిచేష్టలు నెమరు వేసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లా డుతూ ఈ పాఠశాలలో చదువుకున్నందుకుగాను పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకా రాలు అందిస్తామని వారు కొనియాడారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కనకదాసు జయంతి పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - రాయచోటి

కురబలకోట మండలంలో ఈ నెల 27న నిర్వహించబోయే కనకదాసు జయంతి ముగింపు ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం రాష్ట్ర ఉరవ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులతో పాటు ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు లాయర్ కె.రవిశంకర్, రాష్ట్ర కార్యదర్శి మురళీ, బిసి సంఘాల అధ్యక్షులు తరిగొండ ఈశ్వరయ్య హాజరవుతారన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రామాపురం


నాయునిచెరువులో పడి మృతిచెందిన చింతకాయల ప్రసాద్

మండలంలోని కశిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్తపల్లికు చెందిన చింత కాయల ప్రసాద్(32) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆదివారం నాయుని చెరువులో పడి మృతి చెంది నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలి పారు. పోలీసుల వివరాల మేరకు మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన చింత కాయల ప్రసాద్ మద్యంసేవించేందుకు శనివారం ఉదయం తన స్నేహితులతో కలిసి బయటకు వెళ్ళాడని తెలిపారు. సాయంత్రానికి తన స్నేహితులంతా ఇంటికి చేరుకోగా, ప్రసాద్ మాత్రం ఇంటికి వెళ్ళలేదని పేర్కొన్నారు. తన భర్త ఇంటికి చేరకపోవడంతో శనివారం సాయంత్రం బంధువులతో కలసి స్థానిక పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివారం నాయునిచెరువు కట్టపై బట్టలు, చెప్పులు, సెల్ ఫోను పెట్టి చెరువులో శవమై తేలుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే ఎస్ఐ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెరువులో తేలాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష కోసం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారని తెలిపారు. అనుమానస్పద మృతిపై కేసు నమోదు చేసి ధర్యాపు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి-పెద్దమండ్యం

వాహనాల చోరి కేసులో మండలంలోని ముసలికుంట, దామ్లా నాయక్ తాండాకు చెందిన రాజునాయక్ అనే వ్యక్తి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ సాదిక్‌అలీ, ఎస్ఐ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాను సారం, మదనపల్లి డిఎస్పి కేశప్ప పర్యవేక్షణలో విచారణ చేపట్టామని తెలిపారు. నిందితుడు రాజునాయక్ పెద్దమండ్యం పెట్రోల్ బంక్ సమీపంలో మోటార్ సైకిల్ వస్తున్న సమయంలో పోలీసులను చూసి పారిపోవుతుండగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో కర్ణాటక, కడప పరిధిలో దొంగతనం చేస్తున్నట్లు నేరం ఒప్పుకున్నాడని అన్నారు. అతని వద్ద నుండి రూ.7.2 లక్షలు విలువైన 9 ద్విచక్ర వాహనాలను స్వాదినం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని తంబళ్లపల్లి జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. దొంగలింప బడిన 7 ద్విచక్ర వాహనాలు పోలీస్ స్టేషన్లో ఉంచామని, ఎవరి వాహనమైనా కనిపించకుండా ఉంటే సంబంధిత రికార్డులు తెచ్చి చూపిస్తే వారి వాహనాన్ని అప్పగిస్తామని స్పష్టం చేశారు. రాజునాయక్ పైన పుంగనూరు, బి.కొత్తకోట పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు విచారణలో తెలిందని తెలిపారు.

కారు బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి- ములకలచెరువు


తీవ్రంగా గాయపడ్డ సయ్యద్ బాషా

కారుబోల్తా పడి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం ములకల చెరువు మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యంకు చెందిన సి.సయ్యద్ బాషా సొంతంగా కారు నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. పెద్దమండ్యం నుంచి పిటిఎంకు బాడుగ రావడంతో ప్రయా ణి కున్ని వెంట తీసుకెళ్లాడు. ప్రయాణికుడిని వదిలిపెట్టి తిరిగి స్వగ్రామానికి వస్తూ మార్గ మధ్యంలోని గుండ్లపల్లి వద్ద కారు బోల్తా పడి తీవ్రంగా గాయ పడ్డాడు. బాధితున్ని 108సిబ్బంది చికిత్సల నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దీపిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

డ్రైవింగ్ చేయవద్దన్నందుకు వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నిమ్మనపల్లెలో ఆదివారం జరిగింది. మంగళవీధిలో నివాసం ఉన్న పవన్‌కల్యాణ్ ఇటీవల కొత్త టాటాఏస్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. అతని భార్య దీపిక (24) డ్రైవింగ్ నేర్చుకుని ఉండడంతో టాటాఏస్ వాహనాన్ని డ్రైవింగ్ చేస్తానని అడిగింది. అందుకు భర్త వద్దని వారించాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి, దీపిక మనస్థాపంతో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రొద్దుటూరులో యాంకర్ అనసూయ సందడి

ప్రొద్దుటూరు: ఆదివారం సినీనటి, ప్రముఖ యాంకర్ అనసూయ సందడి చేశారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సివిఎస్ మౌలిక సిల్క్ చీరల దుకాణాన్ని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రొద్దుటూరు ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివని అనసూయ అన్నారు.



దుకాణాన్ని ప్రారంభిస్తున్న యాంకర్ అనసూయ


బయో వ్యర్థాలు.. ప్రాణాంతక వ్యాధులు

- రోడ్లపై, చెత్త వాహనాల్లో వేస్తున్న వైనం
- వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా చర్యలు శూన్యం
- చోద్యం చూస్తున్న మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మనం ఏదైనా ఆసుపత్రికి వెళితే వైద్యులు వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్ష చేయించుకుని రమ్మంటారు.. వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు అవసరాన్ని బట్టి ఇంజక్షన్ వేస్తారు.. వీటి కోసం వినియోగించిన సిరంజిలను ఎక్కడ పడితే అక్కడ వేయడం ప్రాణాంతకం. వాటిని తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన బయోమెడికల్ వ్యర్థ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ఇవ్వాలి. కొందరు వైద్యులు కక్కుర్తి పడి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వాహకులకు వ్యర్థాలు ఇవ్వడం లేదు. రోడ్లపై, చెత్త కుండీల్లో పడేస్తున్నారు. వందల సంఖ్యలో చిన్న, పెద్ద ఆసుపత్రులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. ఆసుపత్రులు, ల్యాబ్‌లు వ్యర్థాలను వీరికి ఇవ్వకుండా రోడ్లపై, చెత్త కుండీల్లో, మున్సిపల్ చెత్త వాహనాల్లో వేస్తున్నారు.

రాజంపేట పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రులు, వాటికి అనుసంధానమైన ల్యాబరేటరీలు, మెడికల్ షాపుల నుండి రోజుకు కొన్ని వేలల్లో బయోవ్యర్థాలు పోగవుతూ ఉంటాయి. అలా పోగైన బయోవ్యర్థాలను సాధారణ వ్యర్థాలను తొలగించే పురపాలక వాహనాలలో కాకుండా ఒక ప్రత్యేక వాహనం ద్వారా జనావాసాలు లేని ఒక సురక్షితమైన ప్రాంతానికి తరలించి అక్కడ కాల్చివేయాల్సి ఉంది. పట్టణంలో అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఆసుపత్రులు నుంచి విడుదలయ్యే సూదులు, సిరంజిలు, గాయాలకు కట్లు కట్టిన దూది, కట్టు గుడ్డ, బ్యాండేజ్ క్లాత్స్, బ్లడ్ బాగ్స్, సెలైన్ బాటిళ్లు, ఐవి సెట్లు, గ్లౌజులు, లాబరేటరీలు నుంచి విడుదలయ్యే రక్తం తీయుటకు వినియోగించిన సూదులు, దూది, డిస్పోజల్ టెస్ట్ ట్యూబ్‌లు, మెడికల్ షాపుల నుంచి విడుదలయ్యే ఎక్స్పైరీ డేట్ అయిపోయిన మందులు మొదలైన వాటిని ఎక్కడబడితే అక్కడ రోడ్లమీద, మురుగు కాలువలు, చెత్త డబ్బాలలోను విచ్చలవిడిగా పడవేస్తున్నారు. ఇలా పడవేయడం వలన చెత్త ఎత్తే సమయంలో వాటి బారిన పడి మున్సిపల్ కార్మికులు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. హెచ్ఐవి రోగులకు వినియోగించే సూదులు, బయోవ్యర్థాలు సైతం అందులో ఉండడం వలన పొరపాటున కార్మికులకు ఆ సూదులు గుచ్చుకుంటే వారి జీవితాలు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదు. చెత్తకుప్పల దగ్గర వాటిని పడవేయడం వలన ఆవులు, కుక్కలు, ఇతర జంతువులు వాటిని తిని గాయాలపాలై రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు. బయోవ్యర్థాల మేనేజ్మెంట్ చట్టం 1996 యాక్ట్ ప్రకారం ఈ వ్యర్థాలు ఇతర సాధారణ వ్యర్థాలతో కలవకూడదు. ప్రత్యేకమైన జాగ్రత్తలతో తరలించి వాటిని కాల్చివేయాలని చట్టం చెబుతోంది. కడప, తిరుపతి వంటి నగరాలలో బయోవ్యర్థాలను తరలించడానికి ప్రత్యేకమైన కంటైనర్లను వినియోగిస్తున్నారు. పట్టణంలో అలాంటి ప్రత్యేకమైన చర్యలు చేపట్టకపోతే ప్రజలు, పశువులతో పాటు పర్యావరణం కూడా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా బయో మెడికల్ వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేకమైన కంటైనర్లు, వాహనాలను వినియోగించాలని, ఈ వ్యర్థాలను ఆసుపత్రులు, మెడికల్ షాపులు, లేబరేటరీల వారు ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా చెత్తకుప్పలలోను, డ్రైనేజీ కాలువలలోను పడవేయకుండా మునిసిపల్ మరియు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఓ ఆసుపత్రి వద్ద విచ్చలవిడిగా పడవేసిన బయోవ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం

ప్రయివేటు ఆసుపత్రులు బయోవ్యర్థాలను తరలించడానికి రుసుము చెల్లించి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కానీ వారు అలా చేయడం లేదు. ఇదే సమస్యపై గతంలో ఆసుపత్రుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడం జరిగింది. కానీ ప్రైవేటు ఆసుపత్రుల వారు షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరలా ఈ సమస్య పట్ల ప్రైవేటు ఆసుపత్రులకు గట్టిగా హెచ్చరికలు జారీ చేసి అదుపు చేయడానికి ప్రయత్నిస్తాను.



- శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రాజంపేట.

వేమన పద్య పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రాజీవ్ మార్గం రోడ్డులో ఉన్న రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో వేమన పద్య పోటీలను ఆదివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 163 మంది బాల బాలికలు హాజరయ్యారు. సీనియర్ కేటగిరిలో 98 మంది, జూనియర్ కేటగిరీలో 63 మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు. సీనియర్ కేటగిరీలో మదర్ ఇండియా స్కూలుకు చెందిన బి. హిమ వర్షిత ప్రథమ స్థానం, కడప విద్యా మందిర్ స్కూల్‌కు చెందిన రీతు ద్వితీయ స్థానం, వేంపల్లి శ్రీ చైతన్య స్కూలుకు చెందిన ఎస్. వినయ్ కుమార్ తృతీయ స్థానంలో నిలిచారు. జూనియర్ కేటగిరీలో విశాన్ స్కూలుకు చెందిన మానిరాజు శ్రీ వైష్ణవి ప్రథమ స్థానం, ఆర్ట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చెందిన సాహిత్య పి. చరణ్ ద్వితీయ స్థానం, కె.సాహిత్య తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాహితీ ప్రతిభను వెలికి తీసేందుకు తమ సమితి ప్రతి ఏడాది ఇలాంటి పోటీలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఎలమర్తి మధుసూదన, సమితి కోశాధికారి ఆదినారాయణ రెడ్డి, సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుబ్బిరెడ్డి, పీజే రామసుబ్బారెడ్డి, న్యాయ నిర్ణయితలు పాల్గొన్నారు.



వేమన పద్య పోటీలకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులు కష్టపడి చదవాలి

కడప అర్బన్ : రాబోయే విద్యా సంవత్సరంలో సిబిఎస్ఇ సిలబస్ పుస్తకాలు అందుబాటులో రానున్నాయని, విద్యార్థులు మరింత కష్టపడి చదవాలని మేయర్ సురేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం చిన్నచౌకులోని ఏజెన్సీ బుక్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా రాబోయే విద్యాసంవత్సరం నుంచి అన్ని తరగతులకు సిబిఎస్ఇ సిలబస్ పుస్తకాలు వస్తాయన్నారు. సెంట్రల్ సిలబస్ బుక్స్‌ను భారతి ఏజెన్సీ అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. కేంద్రీయవిద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. అంజాద్ అలీఖాన్ మాట్లాడుతూ కెవి అభివృద్ధికి అందరూ సహకారం అందించాలన్నారు. ట్రెజరర్ జితేంద్ర మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు సిబిఎస్ఇ పాఠ్యపుస్తకాలు భారతి ఏజెన్సీలో అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ రాష్ట్ర చైర్మన్ యనాదయ్య, కెవి పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్ బాబు, సంయుక్త కార్యదర్శి శివరాం ప్రసాద్, కమిటీ సభ్యులు సురేంద్ర రెడ్డి, సూరి బాబు, రామకృష్ణ, శివ, దేవేంద్ర, విద్యార్థులు అమృత్, మొయిన్, అఖిల్,విజయ్ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘనస్వాగతం

కడప అర్బన్ : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ పుష్పగుచ్చం, శాలువాతో ఘనస్వాగతం పలికారు. ఆదివారం కడపకు విచ్చేసిన కమిషన్ చైర్మన్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీలు భూ సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య, వైసిపి నాయకులు సామ్ సీన్, శివ సంపత్ పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం

కడప : యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చునని స్టెప్ సీఈవో సి. సాయి గ్రేస్ అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లీగ్ ఫేస్-2లో భాగంగా లీగ్ యోగా డిస్ట్రిక్ట్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను స్టెప్ సీఈవో డిఎస్ఎ చీఫ్ కోచ్ అమృత్ రాజ్ ప్రారంభించారు. యోగా జిల్లాస్థాయి ఎంపికలకు 40 మంది బాల,బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ యో గాను రోజూ క్రమం తప్పకుండా చేయడం ద్వారా శారీరకద్రత్వంతోపాటు జ్ఞాపక శక్తిని పెంచుకోవడానికి ఏకాగ్రతను సాధించటానికి ఒక ఔషధంలా పనిచేస్తుందన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

రేపు చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం

చెన్నూరు : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 20న ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ భవనంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నామని ఎంపిడిఒ జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో ప్రాథమిక విద్య, పంచాయతీరాజ్, గృహ నిర్మాణం, పశు వైద్య, వ్యవసాయం, నాడు నేడు, జగన్నా స్వచ్ఛ సంకల్పపై , ఉపాధి హామీ, స్త్రీ మరియు శిశు సంక్షేమ , విద్యుత్ శక్తి, స్వయం సహాయక సంఘాలు, హైవే పనులు ఇంకా వివిధ అంశాలపై సమీక్ష ఉంటుందని అధికారులు తగిన సమాచారంతో సమావేశం హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు

కడప : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఈనెల 20, 21 తేదీలలో రెండు రోజులపాటు వైవీయూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డా. జి. రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అథ్లెటిక్స్ పోటీలలో 100 మీటర్లు, 200 మీటర్ల, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, 5000 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్ పుట్‌లలో పోటీలుంటాయన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని 150 అనుబంధ కళాశాలకు సంబంధించిన దాదాపు 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) కళాశాల ఏర్పడి 75 సంవత్సరాలు అయిన సందర్భంలో తొలిసారిగా జరుగుతున్న ఈ క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది పేర్కొన్నారు. రెండురోజుల్లో జరగనున్న ఈ క్రీడలకు శరవేగంగా క్రీడా మైదానం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి నోచని దళితవాడ

పోరుమామిళ్లటౌన్ : పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న శ్రీ అవధూత కాశినాయన మండలం రెడ్డికొట్టాల దళితవాడ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కాలనీలో 70 ఏళ్ల నుంచి సుమారు 40 కుటుంబాలు నివాసముంటున్నాయి. ప్రభుత్వాలు దళితవాడకు కనీస సౌకర్యాలు ఇప్పటికీ కల్పించిన పాపాన పోలేదు. కనీసం పాఠశాల కానీ, అంగన్వాడీ కేంద్రం కానీ ఏర్పాటు చేయలేదు. ఇక్కడ నివాసముంటున్న వారు కూలీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తాగునీటి వసతి కూడా లేదు. ఈ గ్రామం నుంచి ఎంతో మంది సర్పంచులుగా, ఎంపిటిసలుగా పనిచేసినా కాలనీ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. దళితులను నాయకులు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారే తప్ప వారికి కావాల్సిన కనీస వసతులు కల్పించకపోవడం శోచనీయం. సర్పంచ్ రోజూ కాలనీకి వస్తూ పోతుంటారే తప్ప వారికి ఏమి అవసరమో తెలుసుకుని వసతులు కల్పించాలనే ఆలోచన లేకపోవడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి కాలనీలో వసతులు కల్పించాలని కోరారుతున్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చింతకొమ్మదిన్నె: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి అణచి వేయాలని డిఎస్‌పి వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించి రికార్డులు పక్కాగా మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులను ఆప్యాయంగా పలకరించి పరిష్కారం చూపాలని ఆయన సూచించారు. అసాంఘిక శక్తులు, సంఘ వ్యతిరేక కార్యక్రమాలపై గట్టి నిఘా ఉంచాలని చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ అరుణ్ రెడ్డి, ఎఎస్ఐలు కొండారెడ్డి, నాగరాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నీటి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత

కడప : నీటి వనరుల పరిశుభ్రత, పరిరక్షణ మన అందరి బాధ్యత అని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ విబోర్ గుప్తా అన్నారు. ఎన్‌సిసి కంబైన్డ్ వార్షిక శిక్షణా శిబిరం క్యాంపులో భాగంగా ఆదివారం పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమాన్ని బుగ్గవంక డ్యామ్ వద్ద నిర్వహించారు. కేడెట్లు ఉత్సాహంగా పాల్గొని డ్యామ్ పరిసరాలను శుభ్రపరిచారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్ కుమార్ తాపా, కడప, అన్నమయ్య జిల్లాల ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ నీలయ్య, వెంకటరమణ, థర్డ్ ఆఫీసర్లు పి. రాజశేఖర్, ఇమామ్ కాసిం, సిబ్బంది పాల్గొన్నారు.

భాషలపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యార్థులు అన్ని భాషలపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాలసులరెడ్డి అన్నారు. ఆదివారం స్లాట్ ఆధ్వర్యంలో స్కౌట్ హాలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషలపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయడానికి, భాషలపై పట్టు సాధించడానికి ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం హర్షణీయమన్నారు. వైవీ యూ అసోసియేట్ ప్రొఫెసర్ మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మాతృభాషలతోపాటు ఇతర భాషలపై పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్లాట్ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, ఆర్జెయుపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గునిశెట్టి శ్రీనివాసులు, కమల్ సాహెబ్ మెమోరియల్ హిందీ భవన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఫర్వతుల్లా, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తార్ ఫైవ్ జి, హిందీ పండిట్ కాలేజీ కరస్పాండెంట్ రవి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



బహుమతి పొందిన విద్యార్థులతో అతిథులు

'ఉర్దూ'ను కాలరాసేందుకు కుట్ర

ప్రజాశక్తి - కడప

ఉర్దూను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, కార్వాని ఉర్దూ అధ్యక్షులు సయ్యద్ ఖాన్, ఎస్. కె. నసీరుద్దీన్ అన్నారు. ఆదివారం స్థానిక మహారాజా ప్యాలెస్‌లో 'కార్వానే ఉర్దూ' మూడో వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉర్దూ భాష అభివృద్ధి గురించి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, కేంద్ర ప్రభుత్వం ఉర్దూను పూర్తిగా తొలగించాలని ప్రయత్నిస్తోందని విచారకరమని చెప్పారు. దీనిని ఎటువంటి పరిస్థితుల్లో ఒప్పుకోమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా ప్రకటించింది కానీ, అమలులోకి తీసుకురాలేదని అన్నారు. కార్యక్రమంలో హుస్సేనీ బాషా షాహమీరి , ప్రొఫెసర్ సత్తార్ సాహిర్, మహమ్మద్ అలీ బగదాది , తెలుగుదేశం నాయకులు అమీరు బాబు, జిల్లాని భాష గార్లు, వైసీపీ నాయకుడు డాక్టర్ సోహెల్ అహ్మద్, చాలామంది కవులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్

సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప : నగరంలోని పాత మున్సిపల్ ఆఫీసు సమీపం అమీన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నయీమ్ ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష పాల్గొని తొలుత క్రిస్మస్ ట్రీ ని ప్రారంభించి, కేక్ కట్ చేసి, కేక్ ను ఒకరినొకరికి తినిపించి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, డాక్టర్ యూన్సీ, డాక్టర్ రబ్బాని, మమత డాక్టర్ దీపక్ టోనీ, ఏవో ఆది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు, వ్యాపారులకు టిడిపి అండ

ప్రజాశక్తి కడప అర్బన్

ప్రజలకు, వ్యాపారులకు టిడిపి అండగా ఉంటుందని నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాచుపల్లి బస్టాండ్ నుంచి మండి బజారు వరకు ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై దళితులు, మైనార్టీలు బిసిలు ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా పూర్తి స్థాయిలో వివక్షత చూపిస్తుందని విమర్శించారు. వైసీపీకి ప్రజల పట్ల చిత్త శుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయకుమార్, 28 డివిజన్ ఇన్ చార్జ్ గాజుల పల్లె రాఘవేంద్రా, ఉపాధ్యక్షులు షేక్ అల్లాబకాష్, బాలుడు, వెంకటేష్ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న టిడిపి నగర అధ్యక్షులు శివ కొండారెడ్డి

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

చేనేత కార్మికుల ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా కోరారు. ఆదివారం నేక్ నామ్ ఖాన్ కళాక్షేత్రంలో కళాభారతి చేనేత హస్తకళ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి జనవరి 11వ తేదీ వరకు హస్తకళల ప్రదర్శన అమ్మకాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. కళాభారతి అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు, హస్త కళలు ప్రదర్శనలో ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన, అమ్మకాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు చేనేత రంగానికి చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



చేనేత, హస్తకళల మేళాను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం

మహిళలకు పెద్దపీట : డిప్యూటీ సిఎం

కడప : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష అన్నారు. సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు.. ఆదివారం సాయంత్రం నగరంలోని 30/2 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ షేక్. మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో సెవెన్ రోడ్స్ సచివాలయం- 4 పరిధిలోని గుంత బజార్, మంజుమియా పార్క్ వద్దనున్న పలు వీధులలో పలు ప్రాంతాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ వేణుగోపాల్, వైసిపి నాయకులు డాక్టర్ సోహైల్ అహమ్మద్, కాల్ టాక్స్ హాఫీజుల్లా, నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, పసపులేటి మనోజ్ కుమార్, మజహర్ అలీ ఖాన్, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాచర్ల అల్లర్లకు వైసిపి ప్రభుత్వమే కారణం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాచర్ల నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న అల్లర్లకు వైసిపి ప్రభుత్వమే కారణమని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి అక్కడి ప్రజలు, వ్యాపారులు, నాయకులతో మమేకమై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన వివరించే ప్రయత్నంలో దాడులకు పాల్పడ్డం విడ్డూరమన్నారు. వైసీపీ నాయకులు ఎవరు ఎంతటి ఇబ్బందులు కల్పించిన రాబోయే ప్రభుత్వం టిడిపి అన్నారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు సాన్నపురెడ్డి శివకొండారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగము ప్రధాన కార్యదర్శి సాన్నపురెడ్డి రవి శంకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుబ్బరాయుడు, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు పెనుబాల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమీర్ బాబు

డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కడప అర్బన్

దేశంలో ఎక్కడా లేని విధంగా విధంగా జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.వి. అంజాద్ బాషా అన్నారు. ఆదివారం నగరంలో ఎస్‌డిఆర్ఎఫ్ నిధులతో వై జంక్షన్ నుంచి సంజన్న సర్కిల్ వరకు రూ.75 లక్షల వ్యయంతో డ్రైన్ కాలువకు, అప్సర థియేటర్ జంక్షన్ నుంచి కె.సి. కాలువ వరకు ఎస్. డిఆర్ఎఫ్. రూ. 1 కోటి, 99 లక్షలతో నిర్మించబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శివకోటి రెడ్డి, నాగేంద్ర, జయమ్మ, బండి ప్రసాద్, మల్లీశ్వరి, గంగరాజు, నాయకులు రెడ్డి సుబ్బారెడ్డి, ఆర్ఎన్ఐ తోట కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

సమైక్యతకు మారుపేరు అష్ఫాకుల్లాఖాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా చేతుల మీదగా యువ స్వాతంత్ర సమరయోధుల అశ్వాకుల్లా ఖాన్, పండిత్ రాంప్రసాద్ బిస్మిల్ చిత్ర పటాలను ఆయన చేతుల మీదగా ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య కోసం ప్రాణాలు అర్పించిన యువ స్వాతంత్ర సమరయోధుల ప్రాణ త్యాగాలను మరువకూడదన్నారు. కార్యక్రమంలో జెకె యూత్ అధ్యక్షులు ఖాదర్ బాష, ఎన్నారై ఫస్ట్ చైర్మన్ తోటా కృష్ణ, నాయకులు గోరు గోల్డ్, సుబ్బారెడ్డి, రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

25న నెలనెలా సీమ సాహిత్యం సదస్సు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 115వ సదస్సును ఈ నెల 25 ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 115వ సదస్సులో 'బండ్ల వేంకట రమణయ్య జీవితం - సాహిత్యం' అనే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత తెలుగు పండితులు ఎ.సి.దస్తగిరి ప్రసంగిస్తారని తెలిపారు.

ఆధునిక టెక్నాలజీతో అమరరాజా బ్యాటరీస్

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలో అత్య ధిక వారంటీలతో, సేవలతో శరవేగంగా దూసుకుపోతున్న అమరాన్ తాజాగా అడ్వా న్సుడ్ స్టాంపు గ్రిడ్ టెక్నా లజీని (ఎఎస్‌జి) ప్రవేశ పెట్టిందని అమర్ రాజా బ్యాటరీ కంపెనీ మార్కె టింగ్ ఎగ్జిక్యూటివ్ ధనంజ యరామారావు వెల్లడించారు. ఆది వారం మానస హోటల్‌లో అమరాన్ జిల్లా డీలర్ల వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మనీష్ తులీ, రీజనల్ మేనేజర్ నారా చెంగల రాయ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఎస్‌జి టెక్నాలజీ కారణంగా 30 శాతం బ్యాటరీ జీవిత కాలం పెరగడంతో పాటు సిసిఎ పెరుగుతుందన్నారు. దీంతో వినియోగదారులకు అత్యధికంగా 72 నెలలు వారంటీ ఇవ్వగలుగుతున్నామని చెప్పారు. భారత్ నుంచి ప్రపంచంలో 42 దేశాలకు 70 శాతం ఎగుమతి చేసిన ఘనత అమరాన్ దే అన్నారు. దేశంలోని అమ్మే ఆటోమోటివ్ బ్యాటరీలలో రెండో అతి పెద్ద కంపెనీగా చరిత్ర సృష్టిందన్నారు. కంపెనీ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనివాస రావు మాటాడుతూ కంపెనీ ప్రగతిని, టెక్నాలజీని వివరించారు. కంపెనీ రాష్ట్ర సర్వీసు మేనేజర్ నాగుల్ అజాద్ మాట్లాడుతూ సర్వీసు పరంగా అనేక మార్పులు వస్తున్నాయని, అన్నింటిని మన ఫోన్‌లోనే చూడవచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ వారంటీ రిజిస్ట్రేషన్ విధానం అమలవుతుందన్నారు. కార్యక్రమానికి అమరాన్ సంఘం అధినేత వి.దొరబాబు, బిఎస్ఒఎం నాగుల్ ఆజాద్, అమరాన్ ఏరియా సేల్స్ ఎగ్జిక్యూటివ్ పి. ధనుంజయ రామారావు, సర్వీసు ఇంజినీర్ పి. గోవర్ధన్, జిల్లా నలుమూలల నుంచి వచ్చే డీలర్లు, సిబ్బంది, కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ హెడ్

అక్రమ బదిలీలు రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉపాధ్యాయ బదిలీలకు షెడ్యూల్ విడుదల చేసి మరో పక్క ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అక్రమ బదిలీలు నిర్వహిచడం అప్రజాస్వామికమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామంటూ జిఒ విడుదల చేసిన ప్రభుత్వం, కొందరు ఉపాధ్యాయుల పైరవీలకు తలొగ్గి కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ దొడ్డిదారిన అక్రమ బదిలీలు నిర్వహించడం దుర్మార్గమన్నారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన జిల్లా విద్యాశాఖాధికారుల సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖాధికారులు అక్రమ బదిలీలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రహస్య సీల్డ్ కవర్లో డిఇఒలకు అందజేయడం శోచనీయమన్నారు. బదిలీ దరఖాస్తు గడువును మరో రెండు రోజులు పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణమే సిఫార్సు బదిలీలను రద్దు చేసి తమ పారదర్శకతను, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు శివారెడ్డి,హేమలత, జిల్లా ట్రెజరర్ అక్రం బాషా, జిల్లా కార్యదర్శులు చంద్ర శేఖర్, రమణ మూర్తి, శ్రీధర్ రెడ్డి, వెంకట సుబ్బయ్య, గోపాల్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట రమణ, కృష్ణారెడ్డి, చెంగల్ రాజు, ఆడిట్ కమిటీ కన్వీనరు సురేంద్ర రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో వైవీయూ

కడప అర్బన్ : సామాజిక సేవలో విశ్వవిద్యాలయం క్రియాశీలక పాత్ర పోషిస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం వి సి ఆచార్య మునగల సూర్య కళావతి అన్నారు. ఆదివారం కడపలోని యోగి వేమన యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఒకరోజు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మెగా శిబిరాన్ని విసి ప్రారంభించారు. విద్యార్థులు, సిబ్బంది వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కడప హోలిస్టిక్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎన్. శ్రావణ్ కుమార్ రెడ్డి, చక్కెర వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.డి. నవీద్ అహ్మద్, స్త్రీల వ్యాధుల నిపుణులు డాక్టర్ టి.ముని సాయి సంధ్య, కిడ్నీ మూత్ర సంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ డి.దినేష్ కుమార్ రెడ్డి, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ షామిలిరెడ్డి, డాక్టర్ హరినాథ్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్ ఉచితంగా వైద్య సేవలు అందించారు. 200 మంది విద్యార్థులు, 100 మంది సిబ్బంది శిబిరానికి హాజరై వైద్య సేవలు, సలహాలను పొందారు. 30 మంది విద్యార్థులు, 20 మంది సిబ్బందికి ఫాలో అప్ కార్డులను వైద్యులు అందించారు. శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ మేనేజింగ్ పార్టనర్ రఘునాథరెడ్డి, వైవీయూ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డాక్టర్ బి.రెడ్డియ్య, డాక్టర్ పి.వాసుగోవర్ధన రెడ్డి, పి.హనీఫ్, మహమ్మద్ రఫీ సహకరించారు. హోలిస్టిక్ హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్లు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కడప : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించేందుకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ శబరిమలలోని మణికంఠుని ఆలయం లాగా ఈ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయాన్ని కూడా నిర్మించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ముందు ఆలయాన్ని నిర్మించి జనవరి 26న స్వామి విగ్రహాన్ని అందులో ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శంకరయ్య, రానా, భాస్కర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - చాపాడు

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంటలో 40.832 బస్తాల దిగుబడి వచ్చిందని బిసిఓ మునిలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని పల్లవోలు గ్రామ పరిధిలోని రామాంజనేయులు రైతు పంట పొలంలో సైన్స్ పరిశోధన బృందం ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల ఖర్చు కూడా చాలా వరకూ తగ్గుతుందన్నారు. పురుగు మందులు వాడక పోవడం వల్ల మంచి దిగుబడి వస్తుందన్నారు. ఎంఎ డిఎల్ఆర్, బిపిటి 5204, జిలకర మసూర రకం రైతులు సాగు చేశారని, దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. కార్యక్రమంలో సైన్స్ పరిశోధన సంస్థ సభ్యులు సోహెల్, విజయలక్ష్మి, రైతులు రామాంజనేయులు, రామక్రిష్ణయ్య, కిషోర్, లక్ష్మి దేవి పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. సింహాద్రిపురం మండలం కాంబల్లి గ్రామానికి చెందిన మల్లంగి పెద్ద గంగిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. వృద్ధులకు మాంసాహారం భోజనాన్ని వడ్డించారు. తన భర్త జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు దాత బయమ్మ తెలిపారు. ఇలాంటి ఆశ్రమాలు ప్రేమాభిమానాలు కోల్పోయిన తల్లిదండ్రులకు ఆశ్రయాన్ని ఇస్తాయని ఆమె పేర్కొన్నారు. ఆశ్రమాలను ఎంత చేసినా తక్కువే అన్నారు. అనాథ వృద్ధులకు తన వంతు సహాయం అందిస్తానని బయమ్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు గ్రామ దళితవాడకు చెందిన నాగిపోగు బంగియ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, స్థానిక నాయకులు పిచ్చి నాయుడు గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా తాము అండగా ఉంటామని వారికి నాయకులు భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులకు పుట్టా సుధాకర్ యాదవ్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పత్తూరు ఉపసర్పంచు ముత్తూరు రమణ, రాము యాదవ్, జలీల్, ప్రతాప్‌రెడ్డి, పల్లె గంగాధర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల నిరాకరణ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మతం మారారనే కారణంతో దళిత క్రైస్తవులకు, ముస్లిములకు రిజర్వేషన్లు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం అన్నమయ్య జిల్లా కో- కన్వీనర్ డి.సి. వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిరిపురి రామచంద్ర ఆదివారం డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భిన్నంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సర్వత్రా వ్యతిరేకించాలని తెలిపారు. దళిత క్రైస్తవ ముస్లిములకు రిజర్వేషన్ ఇవ్వబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. . దళితులకు మతం మారినంతమాత్రాన సామాజికంగా ఎదురవుతున్న వివక్ష పోదని అన్నారు. ఎస్సీ కోట రిజర్వేషన్ల ఉద్యోగం పొంది చర్చిలకు వెళితే క్రైస్తవులుగా గుర్తించి వారిని ఉద్యోగాల నుంచి భద్రత చేయాలన్న మద్రాస్ హైకోర్టు తీర్పు సామాజిక న్యాయానికి విఘాతం కలిగిస్తుందని తెలిపారు. దళిత క్రైస్తవ ముస్లిముల ఎస్సీ రిజర్వేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అన్నదానం గొప్పది

రాయచోటి టౌన్ : అన్నదానం చాలా గొప్పదని హెల్పింగ్ న్యూస్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటరమణ, సలహాదారులు శశిధర్ అన్నారు. హెల్పింగ్ హాండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉబ్లీకి చెందిన హబీబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నాగార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలు మోడల్ స్కూల్ విద్యార్థులు

రాయచోటి : స్థానిక డైట్ కళాశాలలో ఆదివారం చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 30 మండలాల నుంచి హాజరుకాగా ప్రభుత్వ పాఠశాల నుంచి ఏపీ మోడల్ స్కూల్ రాయచోటి విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాలల నుంచి ఎస్‌విఎస్ఎన్ హై స్కూల్ పీలేరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. జిల్లా అధ్యక్షులు కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, ప్రశ్నించే తత్వాన్ని పెంచే దిశగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు ముఖ్యఅతిథులు హరినాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి మెమోంటో, సర్టిఫికెట్, బహుమతులు అందించారు. డైట్ అధ్యాపకులు అసూదుల్లాబాషా, లెక్చరర్స్ రెడ్డప్పరెడ్డి, రియాజ్, నాగరాజు, జెవివి జిల్లా, మండల బాధ్యులు రౌఫ్ బాష రవీంద్రనాథ్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ప్రభు చరణ్,కి ష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, రాజయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దడం జరుగుతోంది. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతిరోజు ఉదయం క్రమం తప్పకుండా చెత్త సేకరిస్తున్నారు. ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం(జెఎస్ ఎస్) పగడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. ఇందుకు పంచాయతీ అధికారులు, సిబ్బంది జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యసాధన దిశగా చెత్త సేకరణ కార్యక్రమాలు పక్కాగా అమలు చేస్తున్నారు.

ఆరుతడి పంటలకు తెగుళ్లు.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన ఆరుతడి పంటలను తెగుళ్లు ఆశించాయి. కూరగాయల, దోస పంటలకు తెగుళ్లు, వైరస్ అధికంగా సోకుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా వరి పంట నూర్పిడి అనంతరం ఆరుతడి పంటలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఎక్కువగా బీర, కాకర, చిక్కుడు, అనప, బెండ వంటి కూరగాయల సాగును, దోసను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం తీగజాతి కూరగాయల పంటలను ఆకుమచ్చ, బొబ్బడాలు, పెంకు పురుగు, పాము పొడ, గుమ్మడి తెగులు, బూజు తెగులు వంటివి ఆశిస్తున్నాయి. వీటితో రైతులు కుదేలవుతున్నారు. పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఎక్కువగా క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తున్నారు. వేసవిలో ఆరుతడి పంటల ద్వారా సంపాదించుకొవచ్చునని కూరగాయల పంటలను సాగు చేస్తే అవి తెగుళ్ల బారిన పడుతున్నాయని రైతు దిగాలు చెందుతున్నాడు. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో మైదుకూరు, దువ్వూరు మండలాల్లో కూరగాయల సాగు రైతులను చేపట్టేవారు. ప్రస్తుతం చాపాడు, ఖాజీపేట మండలాల్లో కూడా కూరగాయల సాగును రైతులు అధికంగా చేపడుతున్నారు. కూరగాయల పంటల సాగు



సీతారామాపురం వద్ద దోస పంటలో మందులు పిచికారీ చేస్తున్న రైతు

వివిధ దశల్లో ఉన్నాయి. పురుగుమందుల కంపెనీ వారు సూచించిన పలు రకాల క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రైతులకు పలు సూచనలు అందిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

ఇంటి కలను నేరవేర్చిన సిఎం జగన్ : జడ్‌పిటిసి



జగనన్న గృహప్రవేశంలో జడ్‌పిటిసి, సర్పంచు, లబ్ధిదారులు

ప్రజాశక్తి - చక్రాయపేట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇల్లులేని వారి కలను నెరవేర్చారని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మహాదేవపల్లి గ్రామంలో అంజనమ్మ అనే మహిళ ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం అంజనమ్మ గృహప్రవేశం చేశారు. ఇంటిని జడ్‌పిటిసి, సర్పంచు ఉరిమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో సొంత ఇంటి కలను మహిళలు నేరవేర్చుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటిని అందంగా కట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి లబ్ధిదారుడు సిఎం జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు రుణపడి ఉండాలని ఆయన కోరారు. అయా గ్రామాల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేసుకోవాలని ఆయన సూచించారు. జగనన్న ఇంటిలో ప్రవేశించిన చేసిన అంజనమ్మను జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, ఆంజనేయులు, గంగధర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారీ శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే యథేచ్ఛగా కల్తీ మద్యం తయారీ చేసి విక్రయాలు చేయడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో కల్తీ మద్యం తయారీ చేసి, విక్రయిస్తున్న ప్రభుత్వ మద్యం షాపులను ఆదివారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లా డుతూ వైసిపి పాలనలో రాష్ట్రం మద్యాం ధ్రాప్రదేశ్‌గా మారిందన్నారు. ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ మద్యం దుకాణాలపై దాడులు చేసి కల్తీ మద్యం బాటిళ్లను, స్పిరిట్, నకిలీ లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కంచె చేను మేసినట్లు ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బందే చేతి వాటం ప్రదర్శించడం సరికాదన్నారు. తాగుబోతుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి తన మేనిఫెస్టోలో చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దశల వారీగా మద్యాన్ని నిషేధిస్తామని మేని ఫెస్టోలో చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మద్యపాన నిషా పథకం అమలు చేస్తు న్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి



ప్రభుత్వ మద్యం షాపు వద్ద తులసిరెడ్డి

ఉంటే మద్యపాన నిషేధాన్ని రాష్ట్ర వ్యా ప్తంగా అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం అమ్మకాలు దురదృష్టకరం : టిడిపి

ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీలో ఉన్న వేంపల్లె బ్రాంది షాపుల్లో కల్తీ మద్యం అమ్మకాలు దురదృష్టకరమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజులు నుండి మద్యం షాపుల్లో పని చేస్తున్న వ్యక్తులే కల్తీ మద్యం విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. బాటిల్‌కు ఉన్న లేబుల్ మార్చి అదనపు ధరపెట్టి అమ్మకాలు చేయడం దారుణమన్నారు. కల్తీ మద్యంతో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే కల్తీ మద్యం విక్రయాలు చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టక పోవడం దారుణ మన్నారు. కల్తీ మద్యంతో అనారోగ్యం పాలవు తున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం విక్ర యాలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు గోగుల మల్లికార్జున, మహ మ్మద్ ఇదాయతుల్లా, వీరభద్ర, పోతిరెడ్డి శివ, అల్లాబక్ష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

స్కాలర్‌షిప్‌లను వెంటనే పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీ విద్యార్థులకు ఇచ్చే ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను, మైనార్టీ విద్యార్థులకిచ్చే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి నిర్ణయాలు ఈ ఫాసిస్టు ప్రభుత్వపు పేదల వ్యతిరేక, కార్మిక వర్గ వ్యతిరేక విధానాలకు తార్కాణమన్నారు. ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం వర్గాల ప్రజలు దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి స్కూల్స్, ఉన్నత విద్యా సంస్థల్లోనూ చేరేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన సమయంలో.. వారిని చదువు నుంచి దూరం చేసే చర్యలు తీసుకోవడం హేయనీయమన్నారు. అభివృద్ధి, సమాజం నుండ మైనారిటీలను దూరం చేసే చర్యల్లో భాగంగానే ఈ ఫాసిస్టు ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుందని డివైఎఫ్ఐ భావిస్తోందన్నారు. ఉచిత నిర్బంధ విద్యను సాకుగా చూపి కేవలం 9,10 తరగతి విద్యార్థులుకు ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను పరిమితి చేయడం సరికాదన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను పునరుద్ధరించాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేస్తోం దన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, రఘు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో ఆదివారం మున్సిపల్ జిల్లా 5వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగాలను క్రమబద్ధీకిరంచి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు వేతనాలు ఇస్తామని ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పి ఇవ్వడంలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సత్యనారాయణ, విజయకుమార్, రవి, సాల్మన్, చంటి, గుర్రమ్మ, లక్ష్మిదేవి, రాఘవ, నీతమ్మ, ఓబయ్య, రమాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

యంత్రంతో పొలం గుల్ల.. రైతులకు భారం



వరి కోత యంత్రం వల్ల గుంతలుగా ఏర్పడిన పొలం

ప్రజాశక్తి - చాపాడు

అధిక వర్షాలకు వరి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు బురదలో వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి చేయించడం వల్ల గుంతలు ఏర్పడి రైతులకు ఇబ్బందికరంగా మారాయి. వీటిని చదును చేసుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రత్యేకంగా ట్రిల్లర్, దుక్కిళ్లు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఖరీఫ్ సీజన్ వరి నూర్పిడి అనంతరం సాధారణంగా నూగు, దోస, మినుము, పెసర పంటలను రైతులు సాగు చేసేవారు. ప్రస్తుతం వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలతో సాధారణ దుక్కిళ్లతోపాటు పంటల సాగు సాధ్యపడదు. పంట పొలాలకు అధికంగా నీరు పెట్టి ట్రిల్లర్, గేజివీల్స్‌తో దుక్కులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కెసి కాలువకు నీరు వస్తుండడంతో వరి సాగుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. సాధారణ ఆరుతడి పంటలు సాగు చేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడితే ఈ గుంతలతో ఇబ్బం దికరంగా తయారైంది. పం ట పొలాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. వీటిని తొలగించుకునేందుకు రైతు లకు ఆర్థికభారం తప్పడం లేదు. రెండు, మూడు సార్లు దుక్కిళ్లు చేస్తే తప్ప వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలు తొలగించుకునే పరిస్థితి లేదు.



మైలవరం జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మైలవరం

పెన్నా నది పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం జలాశయం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి గౌతమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గండికోట జలాశయం నుంచి దాదాపు అర టిఎంసి నీరు మైలవరం జలాశయానికి రావడంతో అక్కడి నుంచి పెన్నా నదికి క్రమక్రమంగా 6000 క్యూసెక్కుల నుంచి పదివేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వంతెన పనులు చేసే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.



విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంబేద్కర్ సేవా సమితి సభ్యులు

మండలి ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

శాసన మండలి ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రిజర్వేషన్లు కల్పించాలని అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు రామాంజనేయులు కోరారు. ఆ మేరకు ఆదివారం కడప స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఉన్న ఎస్‌సి కమిషనర్ విక్టర్ ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. శాసన మండలిలో ఇప్పటి వరకు రిజర్వేషన్లు కల్పించక పోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. 1998 జిఒ ప్రకారం చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేసే ఎస్‌సిలు అందరూ క్రిస్టియన్లు కాదని, ఆ జిఒను రద్దు చేయాలని కోరారు. శాసన మండలి సభ్యులు ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్‌సిలు చర్చికి వెళ్లినా, దేవాలయాలకు వెళ్లినా వారి సామాజిక హోదా పెరగలేదన్నారు. ఇలాంటి విషయాల్లో చట్టపరమైన ఇబ్బందులు ఉంటే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవ సమితి సభ్యులు, జై భీమ్ సభ్యులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

23న కలెక్టరేట్ ముట్టడి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - మైదుకూరు

ఈనెల 23న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టామని, విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ మండలశాఖ ఇన్‌ఛార్జి కాయగాండ్ల ఓబన్న పిలుపునిచ్చారు. స్థానికంగా ఆయన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ మానికింది వెంకటేష్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ ఉద్యమంలో చదువుకున్న యువత భాగస్వామ్యం కావాలని కోరారు. ఆ మేరకు పెద్ద ఎత్తున విద్యార్థులు యువకులు జనవరి 4న మహబూబ్ నగర్ పామూరు యూనివర్శిటీలో జరిగే ఎంఎస్ఎఫ్ సమావేశాలను, జనవరి 6న బెంగళూరు కేంద్రంగా నిర్వహించే ఎంఆర్‌పిఎస్ జాతీయ సమావేశాలను జయప్రదం చేయడానికి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయరాణి మాదిగ. ఎంఎస్ఎఫ్ మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివ మాదిగ, దొరబాబు, శివ పాల్గొన్నారు.


ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ముద్దనూరు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చి పాస్టర్ దేవసహాయం ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ సమీపంలోని మైదానంలో ఎల్ఎమ్ కాంపౌండ్ యువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నాలుగు టీంలు పాల్గొన్నాయి. ఉదయం ప్రవీణ్ లెవెన్ టీంపై ఏసుదాసు లెవెన్ టీం గెలుపొందగా.. అరుణ్ లెవెన్ శ్రీకాంత్ లెవెల్ టీం గెలుపొందాయి. మధ్యాహ్నం నిర్వహించిన ఫైనల్లో అరుణ్ టీంపై ఏసుదాసు టీం విజయం సాధించింది. విజేతలకు క్రిస్మస్ రోజున బహుమతులు అందజేయనున్నారు. అంపైర్లుగా ఏసు, అరుణ్, సురేష్, ప్రవీణ్, జానీ వ్యవహరించారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకట శేషఫణి

స్థానిక అమ్మవారిశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఆవోపా అధ్యక్షులు పుల్లగూర గోవర్ధన్ తెలిపారు. వైద్య శిబిరంలో కడపకు చెందిన హోమియో వైద్యులు వెంకట శేషఫణి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 150కి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో అవోపా ట్రెజరర్ రాము, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు గోనిగుంట్ల హరికృష్ణ, సుమంత్, జైసాయి, శ్రావణి, నరసింహ, ప్రవీణ్, మిట్ట మోహన్, లీలావతి, చెన్నకేశవ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.